సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మోతీనగర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపిశెట్టి రాఘవేందర్ అన్నారు. మంగళవారం మూసాపేట డివిజన్ బబ్బుగూడకు చెందిన రామ్ నారాయణ ప్రసాద్‌కు మంజూరైన రూ. 3.50 లక్షల చెక్కును అతని కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో బాకారం బుచ్చయ్య, బొమ్మగాని సత్యనారాయణ గౌడ్, ఎస్. ఇందజిత్‌సింగ్, గుడ్డు రాజు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్‌లో 15 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఏఈ శ్రావణితో కలిసి మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, రాము, వెంకట్, రఘురాంరెడ్డి, అంజయ్య యాదవ్, చంద్రశేఖర్, పరశురాములు, ఆంజనేయులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

మూసాపేట: ప్రజల ముందు దళిత యువత్‌పై దాడి చేసిన ఆంధ్రప్రదేశ్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ పేర్కొన్నారు. తెనాలి జిల్లాలో దళిత యువకులపైన తప్పుడు కేసులు పెట్టి నడి బజారులో థర్డ్ డిగ్రీ ప్రయోగం చేయడం సరికాదన్నారు. తిరిగి ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బాలానగర్: మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వివరాల ప్రకారం.. బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి బేగంపేట బ్రాండ్ ఫ్యాక్టరీ సమీపంలో కరణ్ పరమార్(32)నిషేధిత మత్తు పదార్థాలను గోవా నుంచి కొరియర్ ద్వారా తెప్పించి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 19.36 గ్రాముల కొకైన్, 6.77 గ్రాముల ఓజీకుష్ (విదేశీ) మత్తు మందు లభించింది. నిందితుడి నుంచి రూ.55 వేల నగదు, ఐ ఫోన్, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్‌లోని రాంనరేష్ నగర్‌లో 35 లక్షల రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీల్లో ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు కార్పొరేటర్ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతాలను ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రియాంక, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండలం పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ కూకట్‌పల్లి పార్టు, డివిజన్‌ల పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గాంధీ తన కార్యాలయంలో అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, హరినాథ్, నాగేశ్వరరావు, శ్రీకాంత్, యాసిన్ పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్ రెడ్డి

మూసాపేట: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా వేడుకలు జరుపుకోవాలన్నారు. ఎవరైనా చట్టానికి లోబడి ఉండాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోవులను తరలిస్తున్నట్లు ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు నేరుగా గానీ, 100కు డయల్ చేసైనా సమాచారం అందించాలని సూచించారు. వాహనం వద్దకు వెళ్లి గొడవలు చేయవద్దన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజేష్, డీఐ వెంకటేశం, అడ్మిన్ ఎస్‌ఐ రామకృష్ణ, భజరంగ్‌దళ్ నాయకులు జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్డీ బ్యాంక్ నుంచి రూ. 25 వేలు అందజేత



మోతీనగర్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ జోన్ చైర్మన్ కేల వెంకట్రావు అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌కు చెందిన చిన్నారి తేజమై నాయుడు ఆమె తన జన్మదినం సందర్భంగా ఐడీపీఎల్, గాంధీనగర్, పంచశీల కాలనీ ప్రగతి హైస్కూల్‌లో విశాల్ 9వ తరగతి చదువుతూ ఫీజు కట్టలేక ఇబ్బందులు పడుతురన్నాడు. విద్యార్థికి తాను కిడ్డీ బ్యాంకులో దాచుకున్న 25 వేల రూపాయలను తన జన్మదినం సందర్భంగా సంవత్సరం ఫీజును తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, లయన్స్ క్లబ్ ప్రతినిధుల సమక్షంలో పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు తేజమై నాయుడుని అభినందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, లయన్స్‌క్లబ్ గవర్నర్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ప్రెసిడెంట్ కైలాష్, సభ్యులు కృష్ణయ్య, దామోదర్, రమేష్ నాయుడు, శ్రీలత, సౌజన్య, వాణి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి

మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. సంఘం అధ్యక్షులు కర్క నాగరాజు, నాయకులు కర్క పెంటయ్య, కర్క డాకయ్య, యాదయ్య యాదవ్, సూరజ్ యాదవ్, కర్క నిఖిల్, గోపాల్ పాల్గొన్నారు.

కోచింగ్ కోసం వచ్చిన యువతి అదృశ్యం



షైలీ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: ఉన్నత చదువుల కోసం కోచింగ్ తీసుకునేందుకు వచ్చిన ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన షైలీ (22) కోచింగ్ తీసుకునేందుకు ఈనెల 20న కేపీహెచ్‌బీ కాలనీకి వచ్చి ఉమెన్స్ హాస్టల్‌లో చేరింది. ఆమె తమ్ముడు జిల్లెల రమేష్ కూడా కోచింగ్ తీసుకునేందుకు వచ్చి స్థానికంగా ఉన్న శ్రీనివాస హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 23న రమేష్ తన సోదరితో మాట్లాడేందుకు ఫోన్ చేయగా ఫోన్ తీయలేదు. దీంతో హాస్టల్‌కు వెళ్లి విచారించగా.. షైలీ అదే రోజు తన స్వగ్రామానికి వెళుతున్నట్లు హాస్టల్‌లో చెప్పి వెళ్లినట్లు తెలిసింది. అప్పటి నుంచి ఆమె కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెహ్రూ జీవితం ఆదర్శం



నివాళులర్పిస్తున్న శేరి సతీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: చాచా నెహ్రూ ఆదర్శ నాయకుడని, ఆయన పాలనను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్‌కుమార్, ఫణీంద్ర కుమార్, అరవింద్ రెడ్డి, దేవ సహాయం, పొన్నం రజిత, యమున, రామకృష్ణ రెడ్డి, గిరి నాయుడు, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా పనులు

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్



రిటర్నింగ్ వాల్ నిర్మాణంపై ఏసీపీ రమేష్, కార్పొరేటర్‌కు వివరిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్ అన్నారు. మంగళవారం హస్మత్‌పేట బోయిన్ చెరువు కట్టపై అభివృద్ధి పనులను కార్పొరేటర్ నర్సింహయాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కట్ట కుడి వైపు ఏర్పాటు చేసినట్లుగానే ఎడమ వైపు ఫుట్‌పాత్‌లు, రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేసి చెరువును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సోమయ్య, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు కర్రె జంగయ్య, గడ్డం నర్సింగ్‌రావు, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజు, నాగేష్, రాజు, మట్టి శ్రీను, రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా త్వరితగతిన పరిష్కరించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మైత్రి వనం కాలనీలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశ, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో కలిసి పర్యటించారు. మైత్రి వనం కాలనీ ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్ల ప్యాచ్ వర్క్, డ్రైనేజీ, వీధిదీపాలు, వాటర్ సమస్యలు ఉన్నాయని వివరించారు. దీనికి స్పందించిన ఆయన అధికారులకు సమస్యలు వివరించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సెక్రటరీ హనుమంత రావు, జావీద్‌బేగ్, నాగేశ్వర్‌రావు, చరణ్, సతీష్‌కుమార్, మురళీగౌడ్, సత్యనారాయణ, అరుణ, లక్ష్మణ్‌యాదవ్, రాజు, కృష్ణ, ప్రకాశ్, బుర్రి యాదగిరి, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్ అన్నెం కోటిరెడ్డికి మెంబర్‌షిప్ మెడల్ అవార్డు



మెడల్‌ను అందజేస్తున్న జిల్లా గవర్నర్ నగేష్

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నియంత్రణే ధ్యేయంగా పనిచేస్తున్న లయన్ అన్నెం కోటిరెడ్డికి లయన్స్ క్లబ్ చాప్టర్ నైట్ ఫంక్షన్ కార్యక్రమంలో మెంబర్‌షిప్ అవార్డు మెడల్‌ను జిల్లా గవర్నర్ నగేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కోటి రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరింత ఉత్సాహంతో పని చేస్తానన్నారు. కార్యక్రమంలో లయన్ విజయలక్ష్మి, లయన్ అమర్‌నాథ్‌రావు, లయన్ జీఆర్ సూర్యరాజ్, లయన్ వీసీ ఓబుల్ రెడ్డి, లయన్ వి. తిరుపతి రెడ్డి, లయన్ ఏ. శ్రీధర్, లయన్ మధు వెంపటి, లయన్ ఎంకె రాం శాస్త్రి, లయన్ రంజిత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కొనుగోలుకు ద్విచక్ర వాహనాల చోరీ

కేపీహెచ్‌బీకాలనీ: గంజాయి కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దామోదర్, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సిద్ధు కొండాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ద్విచక్ర వాహనాలను చోరీ చేసి బీదర్ వంటి దూర ప్రాంతాల్లో విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో గంజాయి కొనడం, జల్సాలకు అలవాటు పడ్డారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు, మియాపూర్ పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.